క్లుప్తంగా

పీహెచ్‌సీకి వాటర్ ప్లాంట్ వితరణ

రేణిగుంట: రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శుక్రవారం ఒక వాటర్ ప్లాంట్‌ను వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మీపతి అందజేశారు. పీహెచ్‌సీ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. 100 లీటర్ల సామ ర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ ద్వారా ఆస్పత్రి సిబ్బందితోటు రోగులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆయన చెప్పారు. ఆస్పత్రిలో మంచినీటి సౌకర్యం లేదని తెలియడంతో తమ సొసైటీ ఇక్కడ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆస్పత్రి సిబ్బంది ఆయన్ను సన్మానించారు.

ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేయండి



ప్లాట్‌ఫామ్ లేని చేతిపంపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్ద పాలేడు గ్రామంలోని తాగునీటి చేతిపంపునకు ప్లాట్ ఫామ్ లేకపోవటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చేతిపంపునకు ప్లాట్ ఫామ్ లేకపోవడంతో పంపు చుట్టు మురుగు నీరు చేరి, దోమలు వృద్ధి చెందడమే కాకుండా దుర్గంధం చిమ్ముతోందన్నారు. అలాగే చేతిపంపులోని నీరు కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తాగునీటి చేతిపంపు చుట్టూ ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అన్నదానం



భోజనం పొట్లాలను అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

నాగలాపురం: మండలంలోని కొట్టకాడు గ్రామంలో పేదల దినోత్సవం సందర్భంగా యువ భారత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామంలోని నిరుపేదలకు అన్నదానం చేశారు. అనంతరం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందజేశారు. అనంతరం ప్రెసిడెంట్ అయ్యప్ప మాట్లాడుతూ పేదరికాన్ని అంతం చేసేలా అందరూ కలిసిమెలసి ముందుకు సాగాలన్నారు. ఈ భూమిపై నివశించే ప్రతి ఒక్కరు గౌరవప్రదంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘ సేవకుడు విక్రమ్, వెంకయ్య, ప్రకాష్ చంద్ పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో డయేరియా దూరం



మాట్లాడుతున్న వైద్యాధికారి ఉదయ్‌కుమార్

వరదయ్యపాళెం: వ్యక్తిగత శుభ్రతతో డయేరియా వ్యాధిని దూరం చేద్దామని వరదయ్యపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని సంతవేలూరు హైస్కూల్‌లో విద్యార్థులకు డయేరియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నివాసమున్నచోట పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వాతావరణంలో వచ్చిన మార్పులు, తొలకరి వర్షాల కారణంగా ప్రతిఒక్కరూ కాసి, చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాధానోపాధ్యాయులు మాధవయ్య, సూపర్వైజర్ జయలక్ష్మి, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సన్మానం



వైస్ ప్రిన్సిపల్ దండపాణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సత్యవేడు: బాలుర గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన వైస్ ప్రిన్సిపల్ దండపాణిని ఉపాధ్యాయులు, స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మానసభలో ఎంఈఓ కే.రవి మాట్లాడుతూ సత్యవేడులో గురుకుల పాఠశాల ఏర్పాటైన రోజు నుంచి ఇప్పటి వరకు పాఠశాల అభివృద్ధికి, వసతులు కల్పనకు వైస్ ప్రిన్సిపల్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి బడిలో ఉండాలి



ఏర్పేడు: డీవైఈఓ బాలాజిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఏర్పేడు: ప్రతి విద్యార్థి తప్పకుండా బడిలో ఉండాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి బాలాజి అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ×నేను బడికి పోతా¥ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల అడ్మిషన్లు, మౌలిక వసతులు, హాజరును తనిఖీ చేశారు. డీవైఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బడిలో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నేను బడికిపోతా అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. బడిఈడు పిల్లలను బడికి పంపాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉందన్నారు. పీఎంశ్రీ, సీబీఎస్సీ సిలబస్ తదితర అవకాశాలు రానున్నట్లు చెప్పారు. ఇలాంటి సౌకర్యాలన్నింటినీ విద్యార్థులకు అందేలా కృషి చేయాలన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ఉపాధ్యాయులు ఆయనను శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతి అర్బన్ ఎంఈఓ భాస్కర్ నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పండి

బడిఈడు పిల్లలను బడిలో చేర్పాలని మాజీ సర్పంచ్ పార్థసారథిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చిందేపల్లె ప్రాథమిక పాఠశాలలో ×నేను బడికి పోతా¥ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు విద్యాసామగ్రి కిట్లు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో బడికివెళ్లని పిల్లలను గుర్తించాలన్నారు. గుర్తించిన పిల్లలను పాఠశాలలో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో గురునాథం, ఉపాధ్యాయుడు దేవరాజులు, సీఆర్ఎంటీ సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

బుచ్చినాయుడుకండ్రిగ: బడి మానేసిన బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని బుచ్చినాయుడుకండ్రిగ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక తంగెళ్లపురం గిరిజన కాలనీలో నేను బడికి పోతా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఐఈఆర్‌టీ అయ్యప్పరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఆర్పీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండాలని తెలిపారు. బడి మానేసిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలచేలా తల్లిదండ్రులను చొరవ చూపాలన్నారు.





ఏర్పేడు: విద్యార్థులకు విద్యాసామగ్రి కిట్లు అందజేస్తున్న పార్థసారథిరెడ్డి, బుచ్చినాయుడుకండ్రిగ: తంగెళ్లపురం గిరిజన కాలనీలో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



వీఆర్ కండ్రిగ నీటి ట్యాంకు పరిసరాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రవీంద్రబాబు

సత్యవేడు: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు అరికట్టవచ్చని డీఎల్‌పీఓ రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ఏఎంపురం, రాజుల కండ్రిగ పంచాయతీలను డీఎల్‌పీఓ సందర్శించారు. ముందుగా రెండు సచివాలయాలను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. రికార్డుల వినియోగంపై అవగాహన కల్పించారు. వీఆర్ కండ్రిగ, అరుంధతి వాడలో పర్యటించి, పరిసరాల శుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడి, దోమ కాటు నుంచి రక్షణ పొందాలని తెలిపారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మురుగు నీరు తొలగించాలని, దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయాలని సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. ఓహెచ్‌ఆర్ ట్యాంకు శుభ్రతను పరిశీలించారు. 15 రోజులకోమారు నీటి ట్యాంకులు క్లోరినేషన్ చేసి, రికార్డు పుస్తకంలో నమోదు చేయాలన్నారు. నీటి ట్యాంకు చుట్టూ ఉన్న పిచ్చి మొక్కల తొలగింపు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మునిరవికుమార్, సచివాలయ కార్యదర్శులు యుగంధర్, రమణమూర్తి, సర్పంచులు ఎం.శిరీషా, ఎస్. సుజాత, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



మాట్లాడుతున్న శంకర నేత్రాలయ వైద్యులు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్నపాండూరు సచివాలయం ప్రాంగణంలో స్వచ్ఛత్ రూరల్ డెవలప్‌మెంట్, శంకర నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ శిబిరంలో 164 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 54 మందికి ఆపరేషన్ చేయనున్నట్లు శంకర నేత్రాలయ వైద్యులు తెలిపారు. మరికొందరికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో స్వచ్ఛత్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షుడు మావుదూరు మోహన్ మాట్లాడుతూ పేద ప్రజల కంటి జబ్బులకు వైద్యం చేసేందుకు తమ సంస్థ పలుసార్లు శంకర నేత్రాలయం సహకారంతో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి, పలువురికి కంటిచూపు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్యామల, శంకరనేత్రాలయ వైద్యులు ముని, రాము, అల్ఫోన్సా తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీలు



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట పట్టణంలోని హోటళ్లు, ఇతర దుకాణాల్లో జిల్లా ఆహార భద్రతా అధికారులు శుక్రవారం విస్తృత తనిఖీలు చేశారు. జిల్లా ఆహార భద్రత అధికారి ఎస్.మద్దులేటి మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేసి శాంపిల్స్ సేకరించామని తెలిపారు. వాటిని ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయించనున్నట్టు తెలిపారు. వ్యాపారులకు ఆహార నియమ నిబంధలపై అవగాహన కల్పించినట్టు పేర్కొన్నారు. నాణ్యతలేని ఆహార పదార్థాలను ప్రజలకు అందజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రుణాల మంజూరులో తెలుగు రాష్ట్రాలే ప్రథమం



రుణాల చెక్కు పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీలు రాధమ్మ, తులసి, బ్యాంకు జీఎం చంద్రశేఖర్ తదితరులు

తిరుపతి (అలిపిరి): మహిళా సంఘాలకు రుణాల మంజూరులో దేశంలో తెలుగు రాష్ట్రాలే ప్రథమ స్థానంలో ఉన్నాయని తిరుపతి ఇండియన్ బ్యాంక్ జీఎం చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం తిరుపతి నగరం తుడా ప్రాంగణంలోని కచ్చపి ఆడిటోరియంలో ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో రుణ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ సభ్యుల కోసం లక్షపతి దీదీ పథకంతో రూ.5 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇండియన్ బ్యాంక్ ఎఫ్‌జీఎం రాజశేఖర్ ప్రతి ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు ఇండియన్ బ్యాంక్ మొబైల్ యాప్ ఇండ్ స్మార్ట్‌ను విరివిగా ఉపయోగించుకోవాలని కోరారు. తిరుపతి మెప్మా పీడీ రాధమ్మ మాట్లాడుతూ బ్యాంకు రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని.. ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. బ్యాంకు మొబైల్ యాప్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. తిరుపతి డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి మాట్లాడుతు పెద్ద ఎత్తున రుణ వితరణ కార్యక్రమం చేసిన ఇండియన్ బ్యాంకు సేవలను కొనియాడారు. వారికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. చిత్తూరు డీఆర్‌డీఏ పీడీ డీఎంకే తులసి మాట్లాడుతూ చక్కటి ఆర్థిక ప్రణాళికతో ప్రతి బృందం సభ్యురాలు అభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం రుణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ ఎఫ్‌జీఎంఓ పరిధిలో వివిధ బ్యాంకు జోన్లు మొత్తంగా రూ.610 కోట్లు ఒక్క రోజులో రుణ వితరణ చేసినట్లు బ్యాంకు జీఎం తెలిపారు. ఇందులో తిరుపతి జోనల్‌లో రూ.205 కోట్లు, అమరావతిలో రూ.75 కోట్లు, విజయవాడలో రూ.90 కోట్లు, కరీంనగర్‌లో రూ.90 కోట్లు, రాజమండ్రిలో రూ.85 కోట్లు, విశాఖపట్నంలో రూ.70 కోట్లు, హైదరాబాద్‌లో రూ.45 కోట్లు రుణ వితరణ చేసినట్లు ఆయన వివరించారు. అనంతరం ఉత్తమ ఎస్‌హెచ్‌జీలను సన్మానించారు. కార్యక్రమలో తిరుపతి జోనల్ మేనేజర్ ఎం.సెల్వరాజ్, డిప్యూటీ జోనల్ మేనేజర్ బాలచంద్ర మోహన్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపుపై నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద బాధితులు

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ యంత్రాంగం ఆక్రమణలపై కొరడా ఝళిపిస్తోంది. గురువారం గాంధీరోడ్డులో ఆక్రమణలు తొలగించే క్రమంలో దశాబ్దాలుగా పూసలు, దువ్వెనలు తదితర సామగ్రిని విక్రయించే నక్కలోళ్లను తొలగించి, సామగ్రిని కార్యాలయానికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో వారు మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని శుక్రవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. తమ సామగ్రి ఇప్పించాలని, ఇతరులకు అసౌకర్యం లేకుండా విక్రయించుకుంటామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ నరసింహాచారి కలగజేసుకొని టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

ముగిసిన ఖాదర్‌షావలీ గంధోత్సవం



నాయుడుపేట టౌన్ : పట్టణంలో ఉన్న హజరత్ ఖాదర్‌షావలీ (చిన్నదర్గా) గంధోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ముగిశాయి. శుక్రవారం తెల్లవారుజామున దర్గా వద్దకు చేరుకున్న శ్రీవారి గంధాన్ని ముజావర్లు, ఫకీర్ల విన్యాసాల నడుమ దర్గాలో ప్రతిష్ఠించి పాతేహాలు జరిపి భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. మధ్యాహ్నం గిండి రోహిణి కుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దర్గా వద్ద వందలాది మందికి అన్నదానం చేశారు. చిన్నదర్గా కమిటీకి చెందిన చాన్‌బాషా, శేఖర్, రఫీ, షేక్ రియాజ్, నీలిశెట్టి మహేంద్ర, వంశీ, చంద్రశేఖర్, యోగేంద్ర, పఠాన్ హర్షద్, మస్తాన్, కరీముల్లా, కడ్డీ, ఆల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

రసాయనిక వ్యర్థాలతో కలుషితం



చెరువులో ఉన్న రసాయనిక వ్యర్థాలు



కలుషితమై రంగు మారిన చెరువులోని నీరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి గ్రామంలో ఉన్న చెరువులోకి ఫ్యాక్టరీ నుంచి వచ్చే రసాయనిక వ్యర్థాలను తరలిస్తున్నారు. దీంతో చెరువులోని నీరు కలుషితమవుతోంది. ఈ నీటిని తాగిన పశువులు, కుక్కలు, పక్షులు అనారోగ్యం బారిన పడుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. నీటి నుంచి వస్తున్న గాలి సైతం కలుషితంగా మారడంతో ఆ గాలి పీల్చి రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. రసాయనిక వ్యర్థాలను చెరువులోకి తరలించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి, చెరువులోకి రసాయనిక వ్యర్థాలను తరలించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధి కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలి



కూలీలతో మాట్లాడుతున్న శివకుమార్

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు కూలీలకు కేంద్ర ప్రభుత్వం రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహ కార్యదర్శి మించల శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఉపాధి కూలీలతో కలిసి పనిచేశారు. ఆయన మాట్లాడుతూ, యూపీఏ ప్రభుత్వంలో వామపక్షాల పోరాట ఫలితంగా 2004లో సాధించుకున్న చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. కూలీలు పనిచేసే చోట వారికి మౌలిక వసతులు, తాగునీరు, మజ్జిగ, టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో యువత వలస వెళ్లకుండా ఉపాధి హామీ పని జరిగేలా చూడాలని కోరారు.

డయేరియాపై అవగాహన

శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ బాలికల వసతి గృహం–1, 2లో శుక్రవారం విద్యార్థినులకు డయేరియాపై అవగాహన కల్పించి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ లహరి మాట్లాడారు. డయేరియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఆరోగ్య సూత్రాలను వివరించారు. బోరునీటి శాంపిల్‌ను సేకరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ సహాయ అధికారి ఆనందరావు, పీహెచ్ఎన్ సంపూర్ణమ్మ, ఏఎన్ఎం సుధ, ఎంఈహెచ్‌పీ భారతి, ఆశావర్కర్లు మంజుల, హేమలత తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

చీటింగ్ కేసులో ఐదుగురికి జైలు

తిరుపతి లీగల్: భూమి విక్రయానికి సంబంధించి ఓ వ్యక్తిని మోసం చేసిన కేసులో ఐదుగురికి మూడేళ్ల చొప్పున జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ శుక్రవారం తీర్పు చెప్పారు. కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిర్మల, కోర్టు కానిస్టేబుల్ దేవేంద్ర తెలిపిన కేసులోని వివరాలిలా ఉన్నాయి. తిరుపతికి చెందిన బి.హేమంత్‌కుమార్‌రెడ్డి 2007 సెప్టెంబర్ 5వ తేదీ చంద్రగిరి మండలం, మిట్టపాలెం గ్రామ లెక్క దాఖలాలోని వివిధ సర్వే నెంబర్లలోని రెండు ఎకరాలా 44 సెంట్లు భూమిని కొనడానికి తిరుపతి బైరాగిపట్టిడలోని గొట్టిగల్లు కిషోర్‌ను కలిశారు. భూ విక్రయానికి అంగీకరించిన కిషోర్ అతని వద్ద కొంత సొమ్మును అడ్వాన్సుగా తీసుకున్నాడు. దీనిలో భాగంగా సర్వే నెంబర్ 348/1, 5లోని ఒక ఎకరా 28 సెంట్లు భూమికి సంబంధించి కొంత సొమ్మును అడ్వాన్స్ తీసుకొని అగ్రిమెంట్ రాసి ఇచ్చాడు. అగ్రిమెంట్ సమయం దాటుతున్నా కిషోర్ అతని పేరున భూమి రిజిస్టర్ చేయించలేదు. దీంతో హేమంత్‌కుమార్‌రెడ్డి రికార్డులను పరిశీలించగా కిషోర్ తన బంధువైన తిరుపతి ఎంఆర్‌పల్లికి చెందిన సి.దేవకీకి ఆ భూమిని విక్రయించినట్లు విక్రయ పత్రం రాసినట్లు తెలుసుకున్నాడు. దీంతో తనకు భూమి విక్రయిస్తానంటూ నమ్మబలికి అడ్వాన్సుగా రూ.10 లక్షలు దాకా సొమ్ము తీసుకుని మోసం చేసినందుకు కిషోర్‌తోపాటు అతనికి సహకరించిన అతని తల్లి జి.సిద్ధ మునెమ్మ, తిరుపతి ఎంఆర్ పల్లికి చెందిన సి.దేవకి, సి.పూర్ణచంద్రారెడ్డి, తిరుపతి లింగేశ్వర్ నగర్‌కు చెందిన సి.నిరంజన్ రెడ్డి, తిరుపతి బైరాగిపట్టిడకు చెందిన జి.సులోచనపై చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు విచారణ దశలో సిద్ధమునెమ్మ మృతి చెందారు. మిగతా ఐదుగురిపై నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఈకేవైసీ కోసం పరుగులు



- 3 ఉచిత సిలిండర్ల కోసమేనంటూ ప్రచారం!

నగరి: తమ ఏజెన్సీలో వాస్తవ వినియోగదారులు ఎందరున్నారు? వారు లేకున్నా పాసుపుస్తకాలతో సిలిండర్లు ఎవరు కొనుగోలు చేస్తున్నారు? తదితర వివరాలు తెలుసుకోవడానికి గ్యాస్ ఏజెన్సీలు ఈకేవైసీకి పూనుకున్నాయి. ఇందులో భాగంగా ఏజెన్సీ సిబ్బంది వినియోగదారుల ఇళ్ల వద్దకు వెళ్లినప్పుడు గ్యాస్ పుస్తకాలు, బాండ్లు ఆఫీసుకు తేవాలని, వేలి ముద్రలు పెట్టాలని చెప్పారు. ప్రభుత్వం మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడానికే ఈకేవైసీ చేస్తున్నారని ప్రచారం కావడంతో జనం హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ ఏజెన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఈకేవైసీ చేసుకోకపోతే ప్రభుత్వం చెప్పినట్లు 3 సిలిండర్లు ఉచితంగా ఇవ్వరేమోనన్న భయం పట్టుకుంది. దీంతో ఎవరికి వారు గ్యాస్ పుస్తకాలు, బాండ్లు తీసుకొని ఏజెన్సీ కార్యాలయాల వద్దకు వెళ్తున్నారు. ఇతరుల పేరిట ఉన్న పాసు పుస్తకాలను తమ పేరిట మార్చుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. మరోవైపు అందరూ ఒక్కసారికే వచ్చిపడడంతో సర్వర్ బిజీ కావడం, వేలిముద్రల సెన్సార్ల సమస్య తలెత్తడంతో ఏజెన్సీ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. నగరిలోని హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలలో సుమారు 30 వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, ప్రస్తుతం పక్కాగా ఉన్నవేవో తెలుసుకోవడానికే ఈకేవైసీ చేస్తున్నట్టు కార్యాలయ నిర్వాహకులు తెలిపారు.

రుయాలో ప్రత్యేక డయేరియా వార్డు



టాస్క్‌ఫోర్స్ బృందంతో మాట్లాడుతున్న అధికారులు

తిరుపతి తుడా: డయేరియా బాధితుల కోసం తిరుపతి రుయా ఆసుపత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డయేరియా బాధితుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ మేరకు తిరుపతి రుయాలో బాధితుల కోసం స్పెషల్ వార్డును ఏర్పాటు చేశారు. డయేరియా బారిన పడ్డ బాధితులకు మెరుగైన వైద్య చికిత్సను అందించేందుకు 20 పడకలతోపాటు మరో ఐదు ఐసీయూ పడకలను అందుబాటులో ఉంచారు. అత్యవసర మందులను, ఇతర సదుపాయాలను అధికారులు సమకూర్చారు. డయేరియా చికిత్స, వైద్య సదుపాయాలపై వైద్యులు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు.

టాస్క్‌ఫోర్స్ టీం ఏర్పాటు

డయేరియా వ్యాప్తిని అరికట్టడం, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, నెఫ్రాలజీ, మైక్రోబయాలజీ విభాగాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్, ఒక హెడ్ నర్స్, ఫార్మాసిస్టుతో కూడిన టాస్క్‌ఫోర్స్ టీంను నియమించారు. శనివారం నుంచి ఈ బృందం క్షేత్ర స్థాయిలో పని చేయనుంది.

వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

డయేరియా నివారణ బాధితులకు అవసరమైన వైద్యాన్ని అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉండాలని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు తెలిపారు. ఈ మేరకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. నర్సింగ్ విద్యార్థుల ద్వారా హెల్త్ ఎడ్యుకేషన్ అవగాహన కార్యక్రమాల్ని విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు.